## జీపీ భవనానికి స్థల పరిశీలన



జేపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు

చారకొండ, అక్టోబర్ 8: మండలంలోని జేపల్లి పంచాయతీకి నూతన భవనం నిర్మించేందుకు సర్పంచ్ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాలేమియా ఆధ్వర్యంలో ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నార. సీఎం కేసీఆర్ హయాంలో పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. గతంలో సమస్యల వలయంలో ఉన్న గ్రామాలు నేడు అభివృద్ధితో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఈనెల 11న పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేయడానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూర్పల్‌నాయక్, వార్డు సభ్యుడు వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్‌రావు, పరశురాం, రఘునందన్, వెంకటయ్య, ఎల్లయ్య, అశోక్, రాంరెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బీసీఏలోకి మార్చాలి



ఆత్మగౌరవ సభకు తరలివెళ్తున్న ముదిరాజ్‌లు

వెల్దండ అక్టోబర్ 8: ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ –ఏ లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజు కోరారు. ఆదివారం సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో న్విహించిన ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు వెల్దండ నుంచి ముదిరాజ్‌లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా కల్గిన ముదిరాజ్‌ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, శ్రీను, ఎర్రశ్రీను, శ్రీశైలం, గణేశ్, శివ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## పంట దిగుబడి అంచనాలు తయారు

తెలకపల్లి, అక్టోబర్ 8: పంట దిగుబడి అంచనాలను తయారు చేస్తున్నామని ఏవో సందీప్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం సీజన్‌లో పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలను రైతులు చేసినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన దిగుబడి ఏ మేరకు వస్తుందో అంచనాలను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఏఈవోలు స్వయంగా వ్యవసాయ పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి ఈ అంచనాలను సిద్ధం చేస్తారని తెలిపారు. దీంతో దిగుబడి పూర్తయిన తర్వాత మార్కెట్‌లోకి ఏయే పంటలు ఏ మేరకు వస్తాయో తెలుసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతేడాది దాదాపు 35వేల ఎకరాలు సాగు కాగా.. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా 25వేల ఎకరాల మేర పంటలు సాగు చేసినట్లు పేర్కొన్నారు. యాసంగి కోసం వేరుశనగ, మినుము పంటలు వేస్తున్నారని తెలిపారు.

## వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 8: కల్వకుర్తి పట్టణంలోని షిర్డిసాయి సత్య సాయి ప్రశాంతి సన్నిధిలో ఆదివారం సత్యసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరంలోఆయా గ్రామాలకు చెందిన 316మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతి నెల రెండో ఆదివారం ప్రశాంతి సన్నిధిలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో వైద్యులు స్వామి, ప్రవళిక, పూజిత, కృష్ణ, క్రాంతి, సాగర్, సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

◆ జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ◆ మండలంలో సుడిగాలి పర్యటన ◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

ఊర్కొండ, అక్టోబర్ 8: తెలంగాణ ఏర్పాటు తర్వాత గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా బొమ్మరాజుపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం, జగబోయిన్‌పల్లిలో నూతనంగా నిర్మించబోయే ముదిరాజ్ భవన నిర్మణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే యాదవ సంఘం భవనంతో పాటు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ముచ్చర్లపల్లిల్లో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీహాల్ భవనం, ఊర్కొండ మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన 1500 మెట్రిక్ టన్నుల గోదాంను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అక్కడి నుంచి గుడిగాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన స్మశానవాటిక, సీసీరోడ్లను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఎంపీపీ రాధ, కబడ్డీ, కరాటే జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్, జంగయ్య, గిరినాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, ఉపసర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ, అక్టోబర్ 8: మండలంలోని బొమ్మరాజుపల్లికి చెందిన తాడం రాములు శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొమ్మరాజుపల్లి పర్యటనలో భాగంగా ఆదివారం మృతుడి ఇంటికెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే కబడ్డీ, కరాటే జిల్లాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి రూ.5వేలు, ఎంపీటీసీ గోపాల్‌గుప్తా రూ.5వేలు అందజేశారు.

## బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

ఊర్కొండ, అక్టోబర్ 8: తెలంగాణ ప్రభుత్వంఅమలు చేస్తున్న బీసీబంధుకు ఆకర్షితులై కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లిల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినారు. అనంతరం కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన ముగ్గురుని శాలువాతో సన్మానించి అభినందించారు.

# గ్రామాలాభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయం

◆ సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్
◆ చారకొండలో రూ.25 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్

చారకొండ, అక్టోబర్ 8: గ్రామాలభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయమని సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అండర్ డ్రైనేజీ పనులను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టి అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సహకారంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు రూ. 25లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి రూపురేఖలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ప్రతిపక్షాలు జీర్ణించులేక పోతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని కుట్రలు, జిమ్మికులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరిగౌడ్, వార్డు సభ్యులు మల్లేశ్, వెంకటయ్య, సత్యనారి, తిరుపతయ్య, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనుగౌడ్, నాయకులు పర్వతాలుగౌడ్, కొండల్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, వీరయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 12న జెడ్పీ సమావేశం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 8: ఈనెల 12వ తేదీన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఉషారాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశానికి శాశ్వత సభ్యులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

## యువకుడికి సన్మానం

తిమ్మాజిపేట, అక్టోబర్ 8: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికైన మరికల్ గ్రామానికి చెందిన చంద్రకాంత్‌ను ఆదివారం సర్పంచ్ హనుమంతుయాదవ్ శాలువాతో సన్మానించారు. నిరుద్యోగులకు ప్రభుత్వం వివిధ అవకాశాలను కల్పిస్తున్నదని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, బాలయ్య, మధుసూదన్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడపడుచులకు దసరా కానుక

◆ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం
◆ బతుకమ్మ చీరలు పంపిణీ

కల్వకుర్తి, అక్టోబర్ 8: తెలంగాణ ఆడపడుచులకు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగను ఘనంగా జరుపుకొనేందుకు బతుకమ్మ చీరలను సారెగా ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళలకు ఇస్తున్న బతుకమ్మ చీరలను కల్వకుర్తి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చైర్మన్ ఎడ్మ సత్యం ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. తెలంగాణలో స్వర్ణయుగం నాటి పాలన సాగుతున్నదన్నారు. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ.. వారి కష్ట సుఖాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన చీరలతో ఆడపడుచులు దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, కౌన్సిలర్ గోపిరెడ్డిలక్ష్మి, కాల నీలవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆడపడుచులకు తోబుట్టువు సీఎం కేసీఆర్

వెల్దండ, అక్టోబర్ 8: ఆడపడుచులకు తోబుట్టువులా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని కొట్ర సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలో కొట్ర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళలకు సీఎం కేసీఆర్ తోబుట్టువులా చీరలను అందజేస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, కార్యదర్శి బాలస్వామి, నాయకులు సత్యనారాయణ, అల్లాజీగౌడ్, వెంకటయ్యగౌడ్, నిరంజన్, సాయిలు గౌడ్, తిరుపతయ్యగౌడ్, జగత్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, ప్రసన్న, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



కొట్రలో చీరలు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు